www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 మే 2024
5
పశ్చిమ గోదావరి

20న ఆక్వా రైతులతో సదస్సు

ప్రజాశక్తి - పాలకొల్లు

జూన్ 20వ తేదీన పాలకొల్లులో వివిధ జిల్లాల ఆక్వా రైతులతో సదస్సు ఏర్పాటు చేసినట్లు జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. సోమవారం స్థానిక ఎస్‌ఎస్‌ఎస్ కళ్యాణ మండపంలో జరిగిన రైతు ప్రతినిధుల సమావేశం వివరాలను మీడియాకు తెలిపారు. మార్కెట్లో చలో భీమవరానికి తాము పిలుపు ఇవ్వగా రొయ్య ప్రాసెసింగ్, ఫీడ్, సీడ్ యాజమాన్యం తొందరపడొద్దని, రైతులకు న్యాయం చేస్తామని చెప్పారని చెప్పారు. అయితే రైతులకు న్యాయం చేయకపోగా ప్రస్తుతం దారుణ రేట్లకు రొయ్యలు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 20న అన్ని జిల్లాల రైతులతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు మేడిది జాన్ రాజు, సహాయ కార్యదర్శి మేకా ఫణేంద్ర, కోడి విజయభాస్కర్, పెన్మెత్స సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

మహిళా ఓట్లే కీలకం..!

రెండు జిల్లాల్లో పోలైన ఓట్లలో
29,438 మహిళలవే అదనం
8 నియోజకవర్గాల్లో వెయ్యి నుంచి
ఐదు వేల ఓట్లు వరకూ హెచ్చు
ఏ పార్టీకి ఓట్లు వేశారోనని
నాయకుల రకరకాల లెక్కలు
పథకాల వైపు మొగ్గు చూపారా..
మార్పు కోరుకున్నారా అని చర్చ
గెలుపోటముల్లో మహిళా ఓటర్లే
కీలకమని అంచనాలు

జిల్లాలోని ఎన్నికల ఫలితాల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయని అంచనాలు వేస్తున్నారు. అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళా ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయని పోలైన ఓట్ల లెక్కలను బట్టి తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో మొత్తంగా పోలైన ఓట్లలో పురుషుల కంటే మహిళా ఓట్లే అధికంగా ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ ఎనిమిది నియోజకవర్గాల్లో మహిళా ఓట్ల సంఖ్య వెయ్యి నుంచి ఐదు వేల వరకు అదనంగా పోలైన పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులైన మహిళలు ఓటు వేశారా... ప్రభుత్వ మార్పు దిశగా ఓట్లు వేశారా అని రాజకీయ నాయకులు లెక్కలు కడుతున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,37,430 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 13న జరిగిన సాధారణ ఎన్నికల్లో జిల్లాలో 83.65 శాతం పోలింగ్ నమోదైంది. దీనిలో పురుషుల ఓట్లు 6,76,639 పోలవ్వగా, మహిళల ఓట్లు 6,93,172 పోలయ్యాయి. పురుషుల ఓట్లు కంటే 16,533 ఓట్లు మహిళలవే అదనంగా పోలైన పరిస్థితి ఉంది. ఏలూరు నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే 5,903 మహిళల ఓట్లు అదనంగా వేశారు. దెందులూరులో 2,178 మంది, పోలవరంలో 6,208 మంది, చింతలపూడిలో 1,229 మంది మహిళల ఓట్లు పోలయ్యాయి. ఆయా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు తీవ్ర ప్రభావం చూపే అవకాశం కన్పిస్తోంది.

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 14,72,923 మంది ఓటర్లు ఉండగా 82.60 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలైన వాటిలో పురుషుల ఓట్లు 6,02,543 ఉండగా, మహిళల ఓట్లు 6,14,077 ఉన్నాయి. ఈ జిల్లాలోనూ పురుషుల ఓట్లు కంటే 12,905 ఓట్లు మహిళలవే అదనంగా ఉన్నాయి. ఈ జిల్లాలోని ఆచంట నియోజకవర్గంలో 2,998 మహిళా ఓట్లే అదనంగా పోలయ్యాయి. భీమవరంలో 2,482, తణుకులో 4,648, తాడేపల్లిగూడెంలో 1,565 మహిళా ఓట్లు అదనంగా పోలైన పరిస్థితి ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వెయ్యి లోపులో మహిళా ఓట్లే ఎక్కువగా పోలయ్యాయి. రెండు జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళి పరిశీలిస్తే ఒక్క నరసాపురం నియోజకవర్గంలో మాత్రమే పురుషుల ఓట్లు 1,371 ఎక్కువగా నమోదయ్యాయి. మొత్తంగా 13 నియోజకవర్గాల్లో మహిళా ఓట్లే అదనంగా పోలైన పరిస్థితి నెలకొంది.

మహిళలు ఎటువైపు అంటూ చర్చ

అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళల ఓట్లే కీలకం కానుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన మహిళలు అధికార పార్టీవైపే మొగ్గుచూపారని వైసిపి నాయకులు లెక్కలు కడుతుండగా, ఈసారి ప్రభుత్వ మార్పు కోరుకుంటూ మహిళలు ఓట్లు వేశారని టిడిపి కూటమి అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మహిళల ఓట్లు కీలకం కానుండటంతో ఆది నుంచి అభ్యర్థులు వారిని ప్రలోభ పెట్టేందుకు రకరకాల ఎత్తుగడలు సైతం వేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే డ్వాక్రా మహిళలకు చీరలు, గిఫ్టులు వంటివి పంపిణీ చేశారు. అంతేకాకుండా డ్వాక్రా గ్రూపులకు ప్రత్యేకంగా డబ్బు పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలను తమకు అనుకూలంగా మలిచేందుకు డ్వాక్రా సిఎలకు, వాలంటీర్లకు సెల్‌ఫోన్లు సైతం బహుమతులుగా అందించారు. ప్రధాన పార్టీలు మహిళలను ఏమార్చేందుకు చేయని ప్రయత్నం లేదు. దీంతో మహిళలు ఎటువైపు ఓటు వేశారోననే ఉత్కంఠ రాజకీయ నాయకుల్లో నెలకొంది. జూన్ నాలుగో తేదీన ఇవిఎంలు తెరిస్తేనే మహిళలు ఎవరికి పట్టంకట్టారో స్పష్టంగా తెలియనుంది.

ఏలూరు జిల్లాలో పోలైన ఓట్లు..

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పురుషుల ఓట్లు	మహిళా ఓట్లు	అదనంగా మహిళా ఓట్లు
ఉంగుటూరు	1,81,164	90,481	90,678	197
దెందులూరు	1,92,901	95,360	97,538	2,178
ఏలూరు	1,65,132	79,607	85,510	5,903
పోలవరం	2,18,366	1,06,077	1,12,285	6,208
చింతలపూడి	2,22,608	1,10,679	1,11,908	1,229
నూజివీడు	2,10,155	1,05,051	1,05,102	51
కైకలూరు	1,79,536	89,384	90,151	767
మొత్తం	13,69,862	6,76,639	6,93,172	

పశ్చిమగోదావరిలో పోలైన ఓట్లు..

నియోజకవర్గం	పోలైన ఓట్లు	పురుషుల ఓట్లు	మహిళా ఓట్లు	అదనంగా మహిళా ఓట్లు
ఆచంట	1,49,048	73,024	76,022	2,998
పాలకొల్లు	1,60,489	79,802	80,684	882
భీమవరం	2,00,857	99,174	1,01,656	2,482
ఉండి	1,93,722	96,695	97,025	330
తణుకు	1,92,736	94,042	98,690	4,648
తాడేపల్లిగూడెం	1,75,990	87,208	88,773	1,565
నరసాపురం	1,43,825	72,598	71,227	-1,371
మొత్తం	12,16,667	6,02,543	6,14,077	

సీతాదేవి మృతితో విషాదఛాయలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సీతాదేవి (ఫైల్‌ఫొటో)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి ఎర్నేని సీతాదేవి సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని తన కుమార్తె నివాసంలో గుండెపోటుతో మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె భర్త ఎర్నేని నాగేంద్రనాథ్ గతేడాది మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె అంత్యక్రియలు బుధవారం కలిదిండి మండలం కొండూరు గ్రామంలో జరగనున్నట్లు నాయకులు తెలిపారు. సీతాదేవి మృతి పట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం తెలిపారు.

సీతాదేవి రాజకీయ ప్రస్థానం ఇలా

ఎర్నేని సీతాదేవి 1983లో తెలుగుదేశం పార్టీ తరపున ముదినేపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 1985లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలుపొందారు. 1988లో ఎన్‌టిఆర్ మంత్రివర్గంలో కొంతకాలంపాటు ఆమె రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1989లో జరిగిన ఎన్నికల్లో ఆమెకు టిక్కెట్ దక్కలేదు. 1994లో మళ్లీ ఆమె పోటీ చేసి గెలుపొందారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ముదినేపల్లి నియోజకవర్గం రద్దయి కైకలూరు నియోజకవర్గంలో కలిసింది. అనంతరం సీతాదేవి కొంతకాలంపాటు ఖాళీగా ఉన్నారు. 2013లో బిజెపిలో చేరారు. కొంతకాలం తర్వాత మళ్లీ టిడిపి గూటికి చేరారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తరపున ఎన్నికల ప్రచారం చేశారు. ప్రస్తుతం సీతాదేవి విజయ డెయిరీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆమె మంత్రిగా పని చేస్తున్న కాలంలో ముదినేపల్లిలో ఆర్‌టిసి బస్టాండ్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు, పోల్‌రాజ్ కెనాల్, పోల్‌రాజ్ డ్రెయిన్‌పై వంతెనల నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ బాధ్యతగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ అత్యంత బాధ్యతగా మెలగాలని, దీనికోసం నియమించిన కౌంటింగ్ సిబ్బందిని సమాయత్తం చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. సోమవారం సుమిత్ కుమార్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కౌంటింగ్ ఏర్పాట్లపై జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి మాత్రమే ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎన్నికల కమిషన్ నుంచి ఓట్ల లెక్కింపునకు అనుమతి పొందిన సిబ్బంది సంఖ్యకు మించి అదనంగా ఒక్కరిని కూడా వినియోగించడానికి వీల్లేదన్నారు. కౌంటింగ్ ప్రారంభమైన నాటి నుంచి పూర్తయ్యే వరకూ సిబ్బంది ఎవరూ కౌంటింగ్ హాల్‌ను వదిలి ఎట్టి పరిస్థితుల్లో బయటకు రాకూడదన్నారు. ప్రత్యేకంగా భోజన విరామం సమయం ఉండదని, కౌంటింగ్ హాల్లోనే విధుల్లో ఉన్న సిబ్బందికి ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రాలకు పిలిచి వారికి ముందుగానే కౌంటింగ్ ఏర్పాట్లను వివరించాలన్నారు. ఈ ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంతో పాటు, ప్రతి విషయాన్నీ మరోసారి చెక్ చేసుకోవాలని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, తదితరులకు పాసుల జారీ జూన్ 2 నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

సబ్‌కలెక్టర్ అంబరీష్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నేతల వినతి

ప్రజాశక్తి - నరసాపురం

విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘించే పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం నేతలు సబ్ కలెక్టర్ ఎం.ఎ అంబరీష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.జాన్ మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరం మొదలవుతున్న సందర్భంగా విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి పాఠశాల యాజమాన్యమూ చట్ట పరిధిలో అడ్మిషన్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలో, యాజమాన్యాలు చెప్పిన ప్రదేశాల్లోనే పుస్తకాలు కొనాలని, క్యాపిటలైజేషన్ ఫీజు కట్టాలని తల్లిదండ్రులను ఒత్తిడి చేసే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగాన్ని అడ్డుపెట్టుకొని తల్లిదండ్రులను బలవంతం పెట్టడం సరికాదన్నారు. చట్ట ప్రకారం ఏ పాఠశాలలో పుస్తకాలు, బ్యాగులు, యూనిఫారాలు క్రయ విక్రయాలకు అధికారం లేదన్నారు. విద్యా హక్కు చట్టం పట్ల ప్రతి విద్యార్థి తల్లిదండ్రులూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నరసాపురం పట్టణ సహాయ కార్యదర్శి జి.సిరి, నాయకులు పి.ధనుంజయ్, జి.ధీరజ్, అవినాద్ రాయుడు, ఎన్.అరవింద్ రెడ్డి, ఎం.హేమ సతీష్, వి.హిమసాయి, ఎన్.కౌశిక్ పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ముమ్మరంగా ఒఎన్‌జిసి పైపులైన్ పనులు

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామంలో పర్యటించి పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీనివాస్

రుస్తుంబాద గ్రామంలో ఒఎన్‌జిసి పైపులైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం డిఎస్‌పి జి.శ్రీనివాస్ గ్రామంలో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. కొన్ని రోజుల క్రితం పోలీసు బందోబస్తు నడుమ పనులు చేయడానికి అధికారులు యత్నించారు. అయితే గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో రైతులు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీతో మాట్లాడారు. రెండు సార్లు చర్చల అనంతరం గ్రామస్తులు పనులు చేపట్టేందుకు అంగీకరించారు. మరలా రెండు రోజుల నుంచి పనులు జరుగుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

30 నుంచి జాతీయస్థాయి నాటక పోటీలు

సినీనటులు, దర్శకులకు చైతన్య పురస్కారాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

చైతన్య భారతి జాతీయ నాటక పోటీల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఈ నెల 30, 31, జూన్ 1, 2 తేదీల్లో భీమవరంలోని డిఎన్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో 'చైతన్య భారతి 17వ జాతీయ స్థాయి నాటక పోటీలు నిర్వహిస్తున్నట్లు చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్ తెలిపారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 30న డిఎన్‌ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు, మాజీ ఎంఎల్‌ఎ అల్లు సత్యనారాయణ, పంతం వేణుగోపాలకృష్ణ నెహ్రూ జాతీయ స్థాయి నాటిక పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. 30న సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటులు, నాటక రచయిత డాక్టర్ పురాణం వెంకటరామ్ కుమార్‌కు జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటులు దర్శకులు జనాబ్ ఎస్‌ఎం భాషాకు మైనంపాటి రంగనాయకులు రంగస్థల చైతన్య పురస్కారం, జూన్ 2న అజో విభో కందాళం ఫౌండేషన్ అఫ్ అమెరికా వ్యవస్థాపకులు అప్పాజ్యోసుల సత్యనారాయణకు రాయప్రోలు రామచంద్రమూర్తి రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటీమణి ఎం.రత్నకుమారికి పెనుపోతుల శేషగిరిరావు హార్థిక చైతన్య పురస్కారం అందిస్తున్నామని తెలిపారు. జూన్ 2న జరిగే కార్యక్రమానికి సినీ హాస్యనటులు సూరంపూడి సుదర్శనరావు, దర్శకులు రాజా వన్నెంరెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు.

4 రోజులు.. 9 నాటికలు..

నాలుగు రోజులపాటు తొమ్మిది నాటికలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 30న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'మూల్యం', 31న కళాంజలి హైదరాబాద్ వారి రైతే రాజు', అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'మనస్విని', ఉషోదయ కళానికేతన్ వారి 'విముక్తి', జూన్ 1న అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్ర ప్రస్థం', తెలుగు కళాసమితి విశాఖపట్నం వారి 'నిశ్శబ్ధమా ! నీ ఖరీదెంత', శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి 'కౌసల్యా సుప్రజ రామా', 2న చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం', విటిపిఎస్ కల్చరల్ అసోసియేషన్ ఇబ్రహీంపట్నం వారి 'ఎనిమి' నాటికలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ జాతీయస్థాయి నాటక పోటీలను అందరూ తిలకించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాయప్రోలు శ్రీనివాసమూర్తి, పిఆర్ఒ భట్టిప్రోలు శ్రీనివాసరావు, కర్రెడ్డి సత్యనారాయణ, పెన్నాడ శ్రీను, పేరిచర్ల లక్ష్మణ వర్మ, కనగర్ల రామకృష్ణ, ఆర్టిస్ట్ జ్యోతిరాజ్, కాగిత వెంకట రమణ, ముచ్చకరచల హేమసుందర్, యు.అప్పారావు, ఎండి భాషా ,అంగర చిన వీరాస్వామి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో సర్పంచులు చొరవ తీసుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నేత సోమరాజు

ఉపాధి కూలీలకు పని కల్పించడంలో స్థానిక సర్పంచులు కూడా చొరవ తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు సూచించారు. మండలంలోని కృష్ణయ్యపాలెం, ఉప్పరగూడెం గ్రామాల్లోని కూలీలను ఆయన సోమవారం కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలీలకు పూర్తిస్థాయిలో అధికారులు పని కల్పించడం లేదన్నారు. దీంతో కూలీలు అనేక ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు పనులు కల్పించడంలో స్థానిక సర్పంచులు చొరవ తీసుకోవాలని సూచించారు. రోజు వారి వేతనం రూ.600 ఇవ్వాలని, పాత పనిముట్ల స్థానంలో కొత్త పనిముట్లు ఇవ్వాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.రెండు లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.రంగారావు,సిహెచ్ నాగేశ్వరరావు,జి.గంగ భవాని,పోట్ల ధనలక్ష్మి, ధర్మయ్య, గంజి లక్ష్మణరావు, కె.మేరీ కుమారి, నత్త రాధ, మరపట్ల వెంకటరావు, సిహెచ్.సుజాత, ఎడ్లవల్లి వేణు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపును విజయవంతం చేయాలి

ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ రాజీవ్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జూన్ నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనరు శ్రీ రాజీవ్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన విషయంలో ఏమాత్రమూ జాప్యం చేయకుండా భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ త్వరితగతిన కచ్చితమైన ఫలితాలను ప్రకటించాలన్నారు. ఐదు దశల్లో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల సిఇఒలు, జిల్లాల ఎన్నికల అధికారులతో ఎలక్షన్ కమిషనర్లు జ్ఞానేష్‌కుమార్, డాక్టర్ సుఖ్బీర్‌సింగ్‌తో కలిసి సోమవారం ప్రధాన ఎన్నికల కమిషనరు శ్రీరాజీవ్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఓట్ల లెక్కింపునకు చేస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్‌కు సంబంధించిన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని ప్రధాన ఎన్నికల సంఘం కమిషనరు రాజీవ్‌కుమార్‌కు కలెక్టరు వివరించారు. దీనిపై ఆయన మాట్లాడారు. అదే స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు ఇవిఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. పాస్ లేకుండా ఎవరినీ అనుమతించొద్దన్నారు. నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా ఉండేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటి డిప్యూటీ డైరెక్టర్ బొప్పన బాలయ్య, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

1న ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ ఒకటో తేదీన ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి జెడ్‌పిటిసిలు, జిల్లా అధికారులు, ఆహ్వానితులు సకాలంలో హాజరుకావాలని సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ గాంధీని వైసిపి ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గత నెల 13న జరిగిన ఎన్నికల్లో ప్రణాళికాబద్ధమైన, ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన ఉమాబాల

స్వచ్ఛమైన తాగునీరందించండి : సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం

మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

మండల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించి ప్రజల ప్రాణాలు కాపాడాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. పార్టీ మండల కమిటీ సమావేశాన్ని కేతా జ్యోతిబసు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. తాగునీరందిస్తున్న చెరువులు కలుషితమైనా అధికారుల చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ గర్భ జలాలు కూడా కలుషితం కావడంతో ఆ నీరు తాగుతున్న కొంత మంది ప్రజలు కిడ్నీ, లివర్, కేన్సర్ వ్యాధులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండ వేడిమి వల్ల ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు పని ప్రాంతంలో కనీస సదుపాయాలు కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ కమ్యూనిస్టుల పోరాటం వల్లే వచ్చిందని, మోడీ దయవల్ల కాదని తెలిపారు. మండలంలో రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. నామమాత్రపు మరమ్మతులతో సరిపెట్టడం సరికాదన్నారు. రోడ్డు ప్రమాదాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులే బాధ్యత వహించాలన్నారు. రామేశ్వరం నుంచి కవిటం వయా నవుడూరు, కొణితివాడ, మడుగుపోలవరం రోడ్డును విస్తరించకపోవడం దుర్మార్గమన్నారు. జూన్ మొదటి వారంలో తుపాను, అధిక వర్షాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల పట్ల పాలకులు, అధికారులు స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో పోతుల మృత్యుంజయ, బొర్రా ఆలమహారాజు, బాలం విజయకుమార్, తాళ్లూరి హరిహర రామలక్ష్మణ్, గొట్టుముక్కల శ్యాంబాబు పాల్గొన్నారు.

కళ్యాణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

కత్తితో దాడి చేసిన కళ్యాణ్‌పై రౌడీ షీట్ తెరవాలని, కఠినచర్యలు తీసుకోవాలని ఎల్‌బి చర్ల గ్రామస్తులు సోమవారం నరసాపురం డిఎస్‌పి జి.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. వీరికి జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్న) మద్దతు పలికారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన ఎల్‌బి చర్ల గ్రామంలో ఉల్లంపర్తి కళ్యాణ్ అనే యువకుడు కొబ్బరి బొండాలు నరికే కత్తితో గ్రామానికి చెందిన కంచర్ల యుగంధర్, మణికంఠ, రామకృష్ణలను దాడి చేశాడన్నారు. దాడిలో తీవ్రగాయమైన యుగంధర్ ప్రస్తుతం నరసాపురంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నాడన్నారు. నిందితుడు బాధితులపై అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నాడని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగడానికి కళ్యాణ్ కారణమన్నారు. ఎలక్షన్ కోడ్ సైతం లెక్కచేయకుండా హత్యాయత్న ప్రయత్నం చేశాడని, ఇదే యువకుడు నేర చరిత్ర కలిగిన వ్యక్తి అని, పలు జాతరల్లో ఇలాగే వివాదాలు లేపడన్నారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి హరి, గుబ్బల భాను, సంగాని లక్ష్మణ స్వామి, కటకంశెట్టి మామాజీ, బొడ్డు ఆశిష్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి డ్రెయినేజీల్లో పూడికతీత పనులు

ప్రజాశక్తి - నరసాపురం

నేటి నుంచి పురపాలకంలో డ్రెయినేజీల్లో పూడికతీత పనులు ప్రారంభమవుతాయని చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ తెలిపారు. సోమవారం పురపాలక కార్యాలయంలో కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపడుతున్నామన్నారు. వార్డు కౌన్సిలర్లు పనులు పర్యవేక్షించాలన్నారు. కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధికారులతో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడతామన్నారు. కౌన్సిలర్లు కోటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, బొమ్మిడి సూర్యకుమారి, పతివాడ పద్మ మాట్లాడుతూ వార్డుల్లో శానిటేషన్ సక్రమంగా జరగట్లేదని, ఫలితంగా దోమలు పెరిగిపోయి ప్రజల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తోట అరుణ మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఫణికుమార్ శర్మకు నంది పురస్కారం

ప్రజాశక్తి - కాళ్ల

శుక్ల యజుర్వేదంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం పురోహితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ నంది పురస్కారాన్ని అందుకున్నారు. 2024 నంది పురస్కారాన్ని విజయవాడలో రితిక ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం పట్ల కాళ్లకూరు గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఫణీంద్ర శర్మను అభినందించారు.

నేడు ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 28న నరసాపురం టిడిపి కార్యాలయంలో టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొలిట్ బ్యూరో సభ్యులు ఎం.ఎ.షరీఫ్, టిడిపి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చక్కని తర్ఫీదుతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యం

మానవత జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు

ప్రజాశకి - పెనుమంట్ర

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా శిక్షణ ఇచ్చి, చక్కగా తీర్చిదిద్దితే ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా మానవత శాఖ అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు అన్నారు. ఆదివారం రాత్రి పెనుమంట్ర మానవత శాఖ ఆధ్వర్యంలో మార్టేరులోని వేణు గోపాల ఆడిటోరియంలో జరిగిన ముగింపు ఉత్సవాల సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండలశాఖ అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు ఉత్సవాల్లో మే 1 నుంచి యోగ, కుంగుపు, కరాటే, గీతా శ్లోకాలు, కూచిపూడి నాట్యం, సంగీతం, కోలాటంలలో 190 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్, పాల్గొన్న ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్, బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో జిల్లా కార్యదర్శి కొత్త సత్యనారాయణమూర్తి, మండల కార్యదర్శి బండి ప్రసాద్, కోశాధికారి శ్రీనివాసరావు మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవకే అంకితమైన వ్యక్తి కందుకూరి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జీవితాంతం సమాజ సేవకే అంకితమైన పరిపూర్ణ వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ సహాయ కార్యదర్శి కొత్తపల్లి శివరామరాజు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంజన్ కుమార్ అన్నారు. సోమవారం విజ్ఞానవేదిక, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులని, తెలుగు గడ్డపై తొలితరం సంఘ సంస్కర్త, మహిళల సంక్షేమం కోసం జీవితాంతం పని చేసారని, స్త్రీ విద్య కోసం ఉద్యమించి బాలికల పాఠశాలను స్థాపించారని, బాల్య వివాహాలను వ్యతిరేకించి, వితంతు పునర్వివాహాలు చేయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరి శెట్టి కృష్ణ, లైబ్రేరియన్ కె.శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - మొగల్తూరు

తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, కీర్తిశేషులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు చేసిన సేవలు ఎనలేనివని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో టిడిపి మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ముందుగా నిర్వహించి నాగిడి రాంబాబు సమకూర్చిన చీరలను మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుబ్బల నాగరాజు, కోపనాతి పల్లయ్య పాల్గొన్నారు.

మణికంఠకు పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని బియ్యపుతిప్ప గ్రామానికి చెందిన తిరుమాని మణికంఠ మే 13న ఎన్నికల్లో ఓటు వేసి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయాడు. చికిత్స చేయించుకుని ఇంటికి చేరుకున్న మణికంఠను సోమవారం టిడిపి నరసాపురం ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాతాడి ఉమా, జక్కం కాశి, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని అజ్జమూరు గ్రామంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు మరణించింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గరలో డి.నందమ్మ(75) వృద్ధురాలుని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానికులు, బంధువులు పోలీసులకు తెలియజేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం కేసు

ఉండి: వివాహిత అదృశ్యంపై కుమారుని ఫిర్యాదు మేరకు ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం ఉండి గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 26న పని నిమిత్తం భీమవరం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని ఆమె కుమారుడు కొమరపు వెంకట పరందామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ మందలపు లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రొయ్యల చోరీపై కేసు నమోదు

ఉండి: ఉండి గ్రామానికి చెందిన గాదిరాజు వెంకట సత్యనారాయణ రాజు చెరువుపైన పనిచేసే ఏసుబాబు అనే వ్యక్తి సత్యనారాయణ రాజుకు చెందిన ఉప్పుగుంట ప్రాంతంలోని రొయ్యల చెరువులో ఈనెల 26న అర్ధరాత్రి రొయ్యలు చోరీ చేశాడు. సమాచారం తెలుసుకున్న సత్యనారాయణ రాజు చెరువు వద్దకు వెళ్లగా రొయ్యలను ఏసుబాబు అక్కడే వదిలేసి వెళ్లిపోయాడని ఏసుబాబుపై సత్యనారాయణ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఎస్ఐ మందలపు లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

విశ్వకవిలో విద్య.. భవిష్యత్తుకు భరోసా

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత

చదువుకే కాదు క్రీడలకు ప్రాధాన్యత

స్కూల్ డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు

విశ్వకవి రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నేటి సమాజానికి సాంకేతిక పరిజ్ఞానికి దోహదపడేలా తమ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు విద్యాబోధన ఉంటుందని విశ్వకవి రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు అన్నారు. చినఅమిరం గ్రామంలో ఉన్న విశ్వకవి స్కూల్ డైరెక్టర్లు పొట్లూరి రఘుబాబు, పొట్లూరి స్వరూప రాణి, పొట్లూరి కృష్ణ పార్థు ఆధ్వర్యాన రఘుబాబు ప్రజాశక్తితో మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో విద్యలో పెనుమార్పులు వచ్చాయని, దానికి అనుగుణంగా విద్యాబోధన ఉంటుందన్నారు. గత 33 సంవత్సరాలుగా ఉన్న తమైన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్య బోధన సాగిస్తున్నామని, దీంతో ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల విషయంలో మంచి స్కూల్‌లో వేయాలని తపనపడే వారికి విశ్వకవి మంచి వేదిక అన్నారు. ఎల్‌కెజి నుంచి పదో తరగతి వరకూ విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎసి హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. ముఖ్యంగా క్రీడల్లో ప్రావీణ్యం పొందేందుకు ప్రత్యేక శిక్షణ

విద్యార్థిని అభినందిస్తున్న రఘుబాబు

ఇస్తున్నామన్నారు. స్విమ్మింగ్, స్కేటింగ్‌లలో విద్యార్థులు పాల్గొని విజయం సాధిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని తెలిపారు. దీని ఫలితంగానే ఇటీవల వెలువడిన 2024 పదో తరగతి పరీక్ష ఫలితాలలో నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. 36 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 36 మందీ ఉత్తీర్ణత సాధించారన్నారు. ముఖ్యంగా 600 మార్కులకు గాను స్కూల్ టాపర్‌గా కెడిఎస్ అక్షయ 585 మార్కులు సాధించిందని, దీంతో ఆమెకు నగదు పురస్కారం కింద రూ.20 వేలు అందించామన్నారు. ఇలా విద్యార్థులకు చదువుతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలు కూడా నేర్పించడం జరుగుతుందని తెలిపారు.

అంకిత భావంతో విద్యాబోధన అక్షర ప్రత్యేకత

వల్లూరులో అక్షర స్కూల్..

ప్రజాశక్తి - ఆచంట

అంకిత భావంతో విద్యార్థులను ఉత్తేజితలను చేసి విద్యాబోధన అందించడమే అధ్యాపకుల బృందం ప్రత్యేకత అని అక్షర స్కూల్ కరస్పాండెంట్ వి.వి.లక్ష్మి తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన యాజమాన్య సారథ్యంలో ఉన్నత ప్రమాణాల సాధనకై కృషి చేస్తున్న తమ పాఠశాలలో పిల్లలను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి సహాయ సహకారాలను అందించాలని ఆమె మనస్ఫూర్తిగా కోరారు. విద్యార్థులతో అనర్గళంగా చదివించడం, మాట్లాడించడం, త్వరితగతిన చురుకైన గణన చేయడం, అత్యంత స్నేహశీలిగా తీర్చిదిద్దడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం తద్వారా సాధారణ విద్యార్థిని సాధకునిగా మార్చడం మా ప్రత్యేకత అన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ విధానం వల్ల ఇంటి వద్ద పిల్లలకు ట్యూషన్లు అవసరం ఉండదన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యను అందిస్తున్న విద్యాసంస్థ అక్షర స్కూల్ అన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిరంతరం

స్కూల్ కరస్పాండెంట్ వి.వి.లక్ష్మి

తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. విద్యతో పాటు శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె వివరించారు. తమ విద్యాసంస్థలో నర్సరీ నుంచి ఏడో తరగతి వరకూ అడ్మిషన్లు జరుగుతున్నాయని లక్ష్మి తెలిపారు.

అక్షర స్కూల్ ప్రత్యేకతలు..

- అన్ని రకాల సదుపాయాలతో తరగతి గదులు
- విద్యార్థులు కష్టంగా భావించే ఇంగ్లీష్ భాషను సులభమైన రీతిలో బోధించడం
- క్రీడల్లో సరైన అవగాహన కల్పించడం
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- అధునాతనమైన పద్ధతిలో కంప్యూటర్ విద్యాబోధన
- వ్యాన్ సౌకర్యం కలదు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడమే లక్ష్యం

ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ సాంబశివరావు

ఆదిత్య పాఠశాల..

ప్రజాశక్తి - ఆకివీడు

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, వారి మేధస్సును వృద్ధి చేస్తే విద్యార్థి చక్కటి సంస్కారంతో కూడిన విద్యావంతుడు అవుతాడని, ఆ దిశగా పయనించడమే లక్ష్యంగా తాము విద్యాసంస్థను ప్రారంభించామని స్థానిక ఆదిత్య పాఠశాలల చైర్మన్ ఉండ్రమట్ల సాంబశివరావు అన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నిర్వాహక కమిటీ చైర్మన్ సాంబశివరావు ప్రజాశక్తితో మాట్లాడారు. 1997లో గ్రామపంచాయతీ కార్యాలయం వీధిలో సుమారు 80 మంది విద్యార్థులు 10 మంది ఉపాధ్యాయులుతో ఈ పాఠశాలను సాంబశివరావు, కనకదుర్గ దంపతులు ప్రారంభించారు. ప్రారంభంలో కనకదుర్గ ప్రిన్సిపల్‌గా సాంబశివరావు సలహాదారుగా ఉండేవారు. కొల్లేరులో జీవితం ప్రారంభించిన సంవత్సరం అక్కడ ప్రజలతో అనుబంధం కారణంగా మొదటి సంవత్సరంలోనే అక్కడ విద్యార్థులు ఎక్కువగా ఈ పాఠశాలలో చేరారు. క్రమంగా పాఠశాల పెరిగి 2008వ సంవత్సరంలో మరో శాఖ విస్తరించింది. ప్రస్తుతం 1500 మందితో ఈ పాఠశాల నడుస్తుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2002లో ఈ ఆదిత్య ఎడ్యుకేషన్ సొసైటీనీ స్థాపించి ఈ పాఠశాలను సంస్థకు అనుబంధం చేశారు. వరుసగా 15 సంవత్సరాలు ఈ పాఠశాల విద్యార్థులు మండల ప్రథమ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. ధ్యానంతో విద్యార్థులలో జ్ఞాపకశక్తి, ఆలోచన పటిమ పెరుగుతాయనే ఆలోచనతో విద్యార్థులకు ప్రత్యేకంగా ధ్యానం తరగతుల నిర్వహిస్తున్నామన్నారు. తమ పాఠశాలలో విద్యతో సమానంగా వినయం, సంస్కారం, విధేయత నేర్పాలనేది తమ బాటన్నారు. కరాటే, భగవద్గీత పోటీలతో పాటు సైన్స్ ఫెయిర్‌లో కూడా తమ విద్యార్థులు జాతీయస్థాయిలో విజయాలు సాధించారని ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ మండలం నుంచి సైన్స్ ఫెయిర్‌కి జాతీయస్థాయిలో పాల్గొన్న విద్యార్థులు ఒక్కరేనన్నారు. వీటితోపాటు శారీర సౌష్టవానికి ఆటలు, యోగ ప్రతినిత్యం ఉంటాయన్నారు. మండలంలో ఎవరూ సాధించని రీతిలో ట్రిపుల్ ఐటీలో వరుసగా మూడు సంవత్సరాలు తమ విద్యార్థులు అధిక స్థాయిలో సీట్లు సాధించారన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 580 మార్కులు దాటి ఎనిమిది మంది ఉన్నత మార్కులు సాధించి మండలంలో రికార్డు నెలకొల్పారన్నారు. మండలంలో ప్రతి స్థానం తమ విద్యార్థులు పొందినప్పటికీ అదే స్థాయిలో మొత్తం పాఠశాల విద్యార్థులు నిలబడటం ఘనత అన్నారు. విద్యార్థులు తమంతట తాముగా చదవడం, రాయడం చేసుకునే విధంగా చెబుతామన్నారు. వారిపై అధిక ఆజమాయిషి తగ్గాలని, స్వతంత్ర శక్తి పెరగాలని, తల్లిదండ్రులకు సైతం తమ కౌన్సిలింగ్‌లు ఎన్నో నిర్వహించామన్నారు. ఇటీవల యుఎస్ఎకు చెందిన ఫియోలాజికల్ రీసెర్చ్ యూనివర్సిటీ తన సామాజిక సేవకు గాను డాక్టరేట్ బహూకరించిందని వివరించారు. తనతో పాటు తన భార్య కనకదుర్గ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

ప్రిన్సిపల్ ఉండ్రమట్ల కనకదుర్గ

రోహిణి కార్తె ప్రభావంతో వడగాల్పులు

ఆకివీడు: ప్రస్తుతం ప్రజానీకం పరిస్థితి పెనం మీద నుంచి పొయిలో పడినట్టు అయిందంటూ లబో దిబో మంటున్నారు. రోహిణి ప్రవేశించి నాలుగు రోజులైనా మొదటి రెండు రోజులు ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పెద్దగా ఇబ్బంది కలగలేదు. అయితే గత రెండు రోజుల నుంచి మాత్రం వేడిగాలుల తీవ్రత పెరిగింది. రోహిణి కార్తె ప్రవేశానికి ముందు ఎండల తీవ్రత తట్టుకోలేకపోయామని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే రోహిణి ప్రవేశించే నాటికి వాతావరణం చల్లబడడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆ చల్లగాలులు, వాన గాలులు విడిపోయి వేడిగాలి మొదలవడంతో మళ్లీ తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఎండల్లో తిరగడానికి ప్రజలు ధైర్యం చూపించినా వేడి గాలుల ప్రభావానికి ఎక్కడికక్కడ ఆగిపోతున్నారు.

రేపు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 29 బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సినర్జిన్ లాబ్స్ ఉద్యోగాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వర రావు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరు అయ్యే విద్యార్థులు 2022, 2023, 2024(ప్రస్తుత ఫైనలియర్ విద్యార్థులు) సంవత్సరాలలో ఏదైనా డిగ్రీ (కెమిస్ట్రీ), పిజి(కెమిస్ట్రీ), బిటెక్,బిఇ చేసిన విద్యార్థులు అర్హులన్నారు. అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఇంటర్వ్యూకి హాజరు కావాలని ప్రిన్సిపల్ తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణ్ రావు సెల్ 9701394660లో సంప్రదించాలని సూచించారు.

వికలాంగునికి చేయూత

ఉండి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వికలాంగునికి చేయూతనందించడం అభినందనీయమని కలిసిపూడి ఎంపిటిసి, మానవత మండల కో కన్వీనర్ దంగేటి రామలింగేశ్వర రావు అన్నారు. ఉండి మండలం కలిసిపూడి గ్రామానికి చెందిన మందపాటి నాగన్నకు సోమవారం మానవత ఆధ్వర్యంలో ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా దంగేటి రామలింగేశ్వర రావు మాట్లాడుతూ మానవత ఆధ్వర్యంలో ఎంతోమంది వికలాంగులకు చేయూతనందించి వారి కుటుంబాలకు ఆసరాగా నిలిచేందుకు సహకరించామన్నారు. నేడు తమ గ్రామానికి చెందిన వికలాంగునికి అందజేశారని తెలిపారు.

అనుమతులు తప్పనిసరి

పెనుగొండ: ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థులను జాయిన్ చేసుకుంటున్న ప్రయివేట్ విద్యాసంస్థపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయివేట్ సంస్థల యాజమాన్య సభ్యులు కోరారు. సోమవారం పెనుగొండ మండలం సిద్ధాంతంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ సిద్ధాంతంలో నూతనంగా ఒక ప్రయివేటు సంస్థ ఏర్పాటు చేసి విద్యార్థులందరికీ కొన్ని ఉచితంగా ఇస్తామని చెప్పి పిల్లలను స్కూలులో చేర్పించుకుంటున్నారని, ఈ స్కూలుకి ప్రస్తుతానికి ఎటువంటి అనుమతులు లేవని వారు ఆరోపించారు. పిల్లల తల్లిదండ్రులు ఉచితాలకు వెళ్లకుండా పిల్లల భవిష్యత్తుని పాడు చేసుకోవద్దని వారు కోరారు. ఈ విషయంపై పెనుగొండ ఎంఇఒ డి.సుభాకర్‌ని వివరణ కోరగా ప్రస్తుతానికి జిల్లా అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు మా దగ్గరకు రాలేదని వివరణ ఇచ్చారు.

కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - ఆచంట

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ఓట్లు లెక్కింపు నిష్పక్షపాతంగా జరిపేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఆచంట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు అన్నారు. నియోజకవర్గ కౌంటింగ్‌కు సంబంధించి కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్ మైక్రో అబ్జర్వర్లకు సోమవారం స్థానిక రామేశ్వర స్వామి సత్రంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు వారం రోజులే గడువు ఉన్న నేపథ్యంలో జూన్ 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ఓట్లు లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. భీమవరం విష్ణు క్యాంపస్‌లో ఉన్న సీతా పాలిటెక్నిక్ కళాశాల రెండవ అంతస్తులో ఉదయం 6 కల్లా సిబ్బంది కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కౌంటింగ్‌కి సంబంధించి అసెంబ్లీ, పార్లమెంటుకు 14 టేబుల్స్, నాలుగు టేబుల్స్ బ్యాలెట్ కౌంటింగ్‌కి కేటాయించామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పోస్టల్ బ్యాలెట్‌తో మొదలై అరగంట తరువాత 14 టేబుల్‌లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఇవిఎంలను లెక్కింపుకు పంపడం జరుగుతుందన్నారు. సర్వీస్ ఓటర్ల నుంచి వచ్చే పోస్టల్ బ్యాలెట్‌లను స్కానింగ్ చేసే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి 39 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 37 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 38 మంది మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఐపీశెట్టి, ఆర్‌వివి.రోహిణీదేవి, ఎంపిడిఒలు, ఎస్.శ్రీనివాస్ దొర పాల్గొన్నారు.

నరసాపురం: జూన్ 4న నిర్వహించవలసిన కౌంటింగ్ విధానంపై సిబ్బందికి శిక్షణా తరగతులు నరసాపురం రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి డాక్టర్ ఎం.అచ్యుత అంబరీష్ అధ్యక్షతన నరసాపురం మున్సిపల్ కార్యాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ అంబరీష్ మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 6 గంటలకు భీమవరంలోని విష్ణు కళాశాల వద్ద ఏర్పాటు చేయబడిన కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాలని, ఏడు గంటలకు స్ట్రాంగ్ రూమ్ తాళాలు తెరిచి ఇవిఎంలు కౌంటింగ్ సెంటర్‌కు చేరుకుంటాయన్నారు. ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, ఇవిఎంల కౌంటింగ్ 8:15 నుంచి ప్రారంభం అవుతుందని, కౌంటింగ్ సెంటర్‌కు సిబ్బంది సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వాచ్, ఎటువంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అనుమతింపబడవన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేటట్టు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్, మొగల్తూరు తహశీల్దార్ బిఆర్ఎస్ భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులు సమ్మర్ క్యాంప్ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

వేసవిలో గ్రంథాలయాల్లో ఏర్పాటు చేస్తున్న సమ్మర్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకొని తమ మేధాశక్తిని పెంచుకోవాలని పిప్పర గ్రంథాలయ అధికారి పి.రంగారావు అన్నారు. వేసవి సందర్భంగా పిప్పర గ్రంథాలయంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, పెయింటింగు, డ్రాయింగ్‌లపై శిక్షణ ఇవ్వడం జరిగిందని చెప్పారు. శిక్షణా శిబిరం జూన్ 7 వరకు కొనసాగుతుందని విద్యార్థులందరూ శిక్షణా శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు నిలపడానికి వీలుగా బైర్రాజు ఫౌండేషన్ వారు సహకారం అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గుడ్ల వెంకట కృష్ణారావు, బత్తుల నాగరాజు పాల్గొన్నారు.

నరసాపురంలో పుస్తక పఠనం..

నరసాపురం: నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులలో భాగంగా పిల్లలకు కథలు వినిపించడం, వారి చేత చదివించడం 'చిట్టి చిలకమ్మా అమ్మ కొట్టిందా' వంటి పాటలు, గేయాలు పాడించడం జరిగింది. బార్క్ సీనియర్ శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు సైన్స్‌పై అవగాహన, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, విశ్వం గురించి పిల్లలకు వివరించారు. తోట శ్రీనివాస్ చిత్రలేఖనం, తామరపు కృష్ణ కరాటేలో శిక్షణ ఇవ్వడం జరిగింది. శాస్త్రవేత్త సుబ్బారావు పిల్లలకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్ మోహన్, సూర్యం బాబు, ప్రవీణ్, జీవన్ కుమార్, పొన్నాడ సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ శిక్షణా తరగతులను పిల్లలు ఉపయోగించుకోవలసిందిగా గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్‌ఎల్ కుమారి తెలిపారు.

రేపు సర్వసభ్య సమావేశం

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపిడిఒ ఎం.అనుపమ తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షత వహిస్తారని, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు అందరూ హాజరు కావాలని కోరారు.

ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి

పోడూరు: సార్వత్రిక ఎన్నికల నిబంధనలు జూన్ 6వ తేదీ వరకూ కొనసాగుతాయని, ప్రతిఒక్క రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. సోమవారం గుమ్మలూరు పంచాయతీలో రాజకీయ పార్టీలకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాల రోజున అనుమతి లేకుండా విజయోత్సవ ర్యాలీలు చేయడం, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆకివీడు : వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు అనుమతి, పాసులు ఉన్నవారు మాత్రమే వెళ్లాలని, లేని వారు వెళ్లవద్దని ఎస్ఐ నాగబాబు సూచించారు. ఎన్నికల కౌంటింగ్ రీత్యా రాజకీయ పార్టీల మధ్య వ్యత్యాసం కలగకూడదనే భావంతో సోమవారం మండలంలోని పెదకాపవరం, చినకాపవరం, అప్పారావుపేట గ్రామాలలో ఈ సమావేశాలు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని, అందువల్ల ఎవరూ గుమికూడదని చెప్పారు.

పాస్‌పోర్టు పోయినది

పోడూరు మండలం, పోడూరు పెద్దపేట గ్రామానికి చెందిన బద్దా విజయ్‌కుమారి, భర్త: చిరంజీవికు చెందిన **M8392087** నెంబర్ గల పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం పోడూరు నుంచి పాలకొల్లు మోటార్ సైకిల్‌పై తీసుకు వెళ్తుండగా మే 25వ తేదీన పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు మార్గ మధ్యలో పడిపోయినది. కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్: బద్దా విజయ్‌కుమారి
భర్త: చిరంజీవి, ఇంటి నెంబర్: 8-48
పెద్దపేట, పోడూరు మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్‌కోడ్: 534327
సెల్: 9989783571

దస్తావేజులు పోయినవి

యాతం సత్యనారాయణ, తండ్రి: రంగారావు, ఆచంట మండలం, కరుగోరుమిల్లి ముత్యాలవారి పాలెం, పశ్చిమగోదావరి జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయడమేమనగా నాకు సంబంధించి అనగా ఆచంట మండలం, కరుగోరుమిల్లి గ్రామపంచాయతీ పరిధి నాకు సంబంధించి ఇంటి డాక్యుమెంట్స్ 242 స్క్వేర్ యార్డ్స్ ఒరిజినల్ దస్తావేజులు జనవరి 12వ తేదీ 2022 సంవత్సరంలో పోయినవి. బైక్‌కు డాక్యుమెంట్స్ కవరు తగిలించుకుని జిరాక్స్ షాపుకి వెళ్లి వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్: యాతం సత్యనారాయణ
తండ్రి: రంగారావు
కరుగోరుమిల్లి, ముత్యాలవారిపాలెం
ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్‌కోడ్: 534269
సెల్ : 9133609895

ప్రకటన

నా క్లయింటు అయిన **శ్రీమతి శానం జయలక్ష్మి, భర్త: ప్రసాదరావు,** నివాసం: 28-1-110/ఎ రు, శాంతినగర్, 1వ రోడ్డు, ఏలూరు నగరం, ఏలూరు జిల్లా అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ది. 25-07-2011వ తేదీన ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, రామచంద్రరావుపేట, టి.ఎస్. నెం. 2373రులో చ॥గ॥ 100.0.0లు స్థలమును నా క్లయింటు తోడికోడలు అయిన శానం జయలక్ష్మి గారి నుండి దఖలు పొంది ఏలూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం. 5439/2011రుగా రిజిస్ట్రీ పొందియున్నారు. సదరు దస్తావేజును బిర్లాభవన్ సెంటర్‌లోని నా క్లయింటు భర్తగారి షాపు వద్ద ఉంచగా సదరు ఒరిజినల్ దస్తావేజు పోయినది అని ఎంత వెతికినను కనబడలేదు అని తెలియజేసినారు. ఈ రోజు వరకు కనిపించలేదని, సదరు దస్తావేజు నెం. 5439/2011 ఎవ్వరికైనా దొరికిన యెడల తిరిగి నా క్లయింటు అడ్రస్సుకు గానీ, నా యొక్క అడ్రస్సుకి గానీ ఇవ్వగలరు.

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ - నోటరీ, ఏలూరు
సెల్: 9440111033

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), జంగారెడ్డిగూడెం వారి కోర్టులో

O.S. No. 74/2022

Between:

పెనుమాక సత్య దుర్గా జయలక్ష్మి -వాది

Vs

పెనుమాక లలితాంబ మరియు ఆరుగురు -ప్రతివాదులు

4వ ప్రతివాది:

ఆవుల రమా దుర్గ, భర్త: క్రాంతి సాగర్, C/o. పి.ఉషశ్రీ, టీచర్, గౌరీ శంకరపురం, జంగారెడ్డిగూడెం

పై నంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీకు తెలియచేయునది ఏమనగా, పై నంబరు దావా మీ పైన మరియు ఇంకా ఆరుగురి పైన వాది గారు దావాలో పరిహారము నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట దావా వేసి ఉన్నారు. సదరు దావాలో మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినా మీరు తీసుకోనందున, మీ హాజరు నిమిత్తం ది. 28-06-2024 తేదీకి వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా **ది. 28-06-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ తరపు సమాధానము దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి.ఎస్.ఆర్.కె.లక్ష్మణరావు
అడ్వకేట్, 10-4-101, సుబ్బారెడ్డి కాలనీ
స్థలం: జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం
తేది:27-5-2024 సెల్: 9440328779